కార్యకర్త అంతిమయాత్రలో మాజీ మంత్రి

మన్నెం అంతిమయాత్రలో పాల్గొన్న నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు/పెద్దమందడి, ఆగస్టు 3: పెబ్బేరు పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త తొండ మన్యం మృతిచెందాడు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శనివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి అంతిమయాత్రలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వనం రాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ కర్రెస్వామి, నాయకులు ఎల్లయ్య, పెద్దింటి వెంకటేశ్, జూదం వెంకటేశ్, మహేశ్, మాలపల్లె మధు, మహేశ్, మొగిలయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దమందడి మండలంలోని మోజర్ల గ్రామ మాజీ సర్పంచ్ నాగరాజు, విజయ దంపతుల కూతురు తృతీయ జన్మదిన వేడుకలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు.

సప్తాహ భజనలు ప్రారంభం

మల్దకల్, ఆగస్టు 3: ఆదిశిలా క్షేత్రంలో వెలిసిన లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం సప్తాహ భజనలను సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి, ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భజనలు చేశారు. వచ్చిన భక్తులకు పెద్దొడ్డికి చెందిన నల్లారెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు మధుసూదన్‌రెడ్డి, రమేషాచారి, ధీరేంద్రదాస్, రవిచారి, మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బాబురావు, నరేందర్, చంద్రశేఖర్ రావు, నాగరాజుశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి' టీఏకు నివాళి

అయిజ, ఆగస్టు 3 : ఎన్‌ఆర్‌ఈజీఎస్ టీఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్‌కుమార్ శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. శనివారం అయిజ మండల ఉపాధి హామీ సిబ్బందితో కలిసి ఎంపీడీవో వెంకటయ్య ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తెలంగాణలోని టీఏల సమస్యలు పరిష్కరించడంలో సంజయ్‌కుమార్ కీలకపాత్ర పోషించాడని కొనియాడారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు.

వయనాడు వరద బాధితులకు విరాళం

ధరూరు, ఆగస్టు 3: కేరళలోని వయనాడు వరద బాధితులకు అండగా మండల కేంద్రంలో సీపీఎం నాయకులు శనివారం విరాళాలు సేకరించారు. వైఎస్సార్ చౌరస్తాలో చందా చేయగా.. రూ.4,573రాగా, ఈ మొత్తాన్ని కేరళ ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేరు నర్సింహ, మండల కార్యదర్శి దేవదాసు, మేకల నర్సింహులు, సభ్యులు ప్రవీన్, తిమ్మప్ప, ఆంజనేయులు, రాజు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న హోంగార్డు

గద్వాల అర్బన్, ఆగస్టు 3: గద్వాల పట్టణంలోని రాజీవ్‌మార్గ్‌లో ట్రాఫిక్ విధులు నిర్వర్తించే విష్ణు రోడ్డుపై దొరికిన మొబైల్ ఫోన్‌ను బాధితుడికి అందించి నిజాయితీ చాటుకున్నాడు. శనివారం విధులు నిర్వర్తిస్తుండగా.. అనుకోకుండా ద్విచక్రవాహనదారుడి జేబులోంచి మొబైల్ జారిపడింది. ఆ మొబైల్ హోంగార్డుకు కనబడడంతో ఫోన్‌ను ఎస్సై బాలచంద్రుడికి ఇచ్చాడు. ఎస్సై బాధితుడికి తెలియజేసి, మొబైల్ పత్రాలు తీసుకుని హోంగార్డు చేతుల మీదుగ అందజేశారు. మొబైల్ పోగొట్టుకున్న వ్యక్తి హోంగార్డుకు కృతజ్ఞతలు తెలుపగా.. ఎస్సై అభినందించారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

గోపాల్‌పేట, ఆగస్టు 3: చిత్తూరు జిల్లాకు చెందిన యుగేంధర్ మండలంలోని ఏదుట్లలో ఉంటూ, ప్రైవేటు జాబ్ చేస్తున్నాడు. గతనెల 10న తన సెల్ ఫోన్ పోగొట్టుకొని స్థానిక ఠాణాలో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి సెల్‌ఫోన్ ఆచూకీ తెలుసుకున్నారు. లభించిన సెల్ ఫోన్‌ను శనివారం ఎస్సై హరిప్రసాద్ పోలీస్‌స్టేషన్ వద్ద బాధితుడికి అందజేశారు.

వైభవంగా రాములోరి కల్యాణం

స్వామివారి కల్యాణ వేడుకలు జరిపిస్తున్న అర్చకులు

ఇటిక్యాల, ఆగస్టు 3 : బీచుపల్లి క్షేత్రంలోని కోదండరామాలయంలో పునర్వసు నక్షత్రమున శనివారం స్వామివారి కల్యాణ వేడుకలను అత్యంత వైభవంగా జరిపించారు. దినకరస్వామి, దత్తుస్వామి వేదమంత్రోచ్చారణలతో స్వామివారి కల్యాణ ఘట్టం పూర్తి చేశారు. కనుల పండువగా సాగిన ఈ వేడుకలకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ సురేందర్‌రాజు, అసిస్టెంట్ మేనేజర్ రఘు వేడుకలను పర్యవేక్షించారు.

పాఠశాల సమయంలో బస్సులు నడపాలి

కొంకనోనిపల్లిలో ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అమరచింత, ఆగస్టు 3: పాఠశాల సమయంలో మరికల్ –ఆత్మకూర్ వరకు ఆర్టీసీ బస్సులను నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవ, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొంకనోనిపల్లిలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నడిరోడ్డుపై విద్యార్థులతో కలిసి పాఠశాల సమయంలో ఆర్టీసీ బస్సులను నడపాలని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆత్మకూర్, మరికల్ రూటులో విద్యార్థుల సౌకర్యార్థం బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం అక్కడికి వచ్చిన పోలీసులు నారాయణపేట డిపో అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

- ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్
- పెండింగ్ అర్జీలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న వనపర్తి, జోగుళాంబ గద్వాల కలెక్టర్లు ఆదర్శ్ సురభి, సంతోష్

వనపర్తి టౌన్, ఆగస్టు 3: ధరణిలో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు ఆదేశించారు. శనివారం ధరణి దరఖాస్తు పెండింగ్‌లపై ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధరణి కేసులు పెండింగ్‌లో లేకుండా వచ్చిన రెండు, మూడు రోజుల్లోనే పరిష్కరించాలని, ఒకవేళ దరఖాస్తును తిరస్కరించాల్సి వస్తే అందుకు నిర్దిష్టమైన కారణాలు చూపించాలని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ అదనపు కలెక్టర్లు, ఆర్డీవో, తాసీల్దార్‌లతో సమీక్ష నిర్వహించారు. ధరణి దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్డీవో పద్మావతి, ఏవో భానుప్రకాశ్, తాసీల్దార్లు తదిరతులు ఉన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

గద్వాల, ఆగస్టు 3: ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సీసీఎల్‌ఏ కమినర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి కలెక్టర్లతో ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను ఎన్ని పరిష్కరించారని కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో పెండింగ్‌గా ఉన్న ధరణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జోగులాంబ గద్వాల కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సంతోష్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో పెండింగ్‌గా ఉన్న ధరణి దరఖాస్తులను ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో తాసీల్దార్లు ప్రణాళికాబద్ధంగా ప్రతిరోజూ ధరణి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆర్డీవో, తాసీల్దార్ల లాగిన్‌లో పెండింగ్‌గా ఉన్న ధరణి సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. వీసీలో ఆర్డీవో రాంచందర్, ఏవో భద్రప్ప, ఆయా మండలాల తాసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ అర్జీలపై చర్యలు తీసుకోవాలి

వనపర్తి టౌన్, ఆగస్టు 3: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు కలెక్టర్లు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించినట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి పేర్కొన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనపై శనివారం మధ్యాహ్నం మున్సిపల్ పరిపాలనాధికారి ధానకిశోర్‌తో కలిసి డిప్యూటీ సీఎం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిప్యూటీ సీఎం ఖమ్మం కలెక్టరేట్, రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జయశంకర్ భూపాలపల్లి కలెక్టరేట్ నుంచి సమీక్ష నిర్వహించారని కలెక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా పలువురు మంత్రులు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్వర్వుల ప్రక్రియ 131, 135, 138 ద్వారా ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్నారని, ఈ ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను దూరం చేసేందుకు ఎల్‌ఆర్‌ఎస్‌ను క్రమబద్ధీకరించేందుకు నిర్దిష్ట మార్గనిర్దేశాలను జారీచేశారు. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ప్రభుత్వ భూమి అక్రమదారులకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకొని న్యాయబద్ధంగా ఎల్ ఆర్‌ఎస్ దరఖాస్తులను ఆమోదించాలని సూచించారని చెప్పారు. 2020 ఆగస్టు 26నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించేందుకు ఎల్1, ఎల్2, ఎల్3, ఎల్4 స్థాయిలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎల్1 స్థాయిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, టౌన్‌ప్లానింగ్ అధికారి క్షేత్రస్థాయిలో వెళ్లి ప్లాట్లను పరిశీలించాల్సి ఉంటుందని, ఎల్2 స్థాయిలో డిప్యూటీ తాసీల్దార్ పరిశీలన, ఎల్3 మున్సిపల్ కమిషనర్, డీపీవోలు, ఎల్4 స్థాయిలో కలెక్టర్ తుది అనుమతి జారీ చేస్తారని చెప్పారు. జిల్లా అధికారులు విస్తృత అధికారులను ఉపయోగించుకొని అవసరమైతే తాత్కాలిక సిబ్బందిని నియమించుకొని మార్చి 2025లోగా అన్ని దరఖాస్తులు పూర్తిచేయాలని సూచించినట్లు చెప్పారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీల్లో అనకాధికార లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన ప్లాట్లు, వచ్చిన దరఖాస్తులను సర్వే నెంబర్ ఆదారంగా విభజించుకొని ప్లాట్ల దగ్గరికి వెళ్లి జియో ట్యాగింగ్ చేసి అనుమతులివ్వాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వెళ్లి వివరాలను సేకరించేందుకు ఎల్1 టీమ్‌లను నియమిస్తారని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవి కాకుండా న్యాయబద్ధంగా ఉన్న ప్లాట్లను ఎల్‌ఆర్‌ఎస్ ఆమోదించేందుకు చర్యలు ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, మున్సిపల్ కమిషనర్, డీపీవో తదితరులు ఉన్నారు.

జైలు లోక్ అదాలత్ విజయవంతం

వనపర్తి టౌన్, ఆగస్టు 3: వనపర్తి లోక్ అదాలత్ ఆధ్వర్యంలో శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలతో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైంది. వనపర్తికి జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీలత జైలులోని ఖైదీలతో మాట్లాడి వ్యక్తిగత ప్రవర్తనపై కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ బాలనాగయ్య, కౌన్సిల్ సభ్యులు ఉత్తరయ్య, శ్రీదేవి, జైలు సూపరిండెంట్‌లు తదితరులు ఉన్నారు.

కోతికి దహన సంస్కారాలు

కోతిన పూడ్చిన యువకులు

గద్వాల రూరల్, ఆగస్టు 3: మండలంలోని జమ్మిచేడు హైవేపై ఒక కోతిని ఆటో ఢీకొనగా.. అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకున్నది. అక్కడే ఉన్న యువకులు చూసి కోతికి సంప్రదాయ పద్ధతిలో దహన సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో వెంకటేశ్, నరేశ్, రవి, కృష్ణ, అద్భుతకుమార్, అంజి పాల్గొన్నారు.

కేసీఆర్ చొరవతోనే మాదిగలకు న్యాయం

గోపాల్‌పేటలో క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

పెబ్బేరు, ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణ విషయంలో మాజీ సీఎం కేసీఆర్ గతంలో పలు పర్యాయాలు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించిన ఫలితంగానే వారికి న్యాయం జరిగిందని పెబ్బేరు తాజామాజీ జెడ్పీటీసీ పెద్దింటి పద్మ పేర్కొన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ముప్పై ఏండ్ల సుదీర్ఘ పోరాటానికి ఇప్పుడు ఫలితం లభించిందన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన చారిత్రక తీర్పును ఎస్సీలలోని ప్రతిఒక్కరూ స్వాగతిస్తున్నారని తెలిపారు. ఎస్సీ కులాల వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బీఆర్‌ఎస్ మొదటి నుంచి భావిస్తోందని, తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా కేసీఆర్ వర్గీకరణ డిమాండ్‌కు అనుకూలంగా మాట్లాడారని గుర్తు చేశారు. స్వరాష్ట్రం ఏర్పడ్డాక జరిగిన మొదటి అసెంబ్లీ సమావేశాల్లో కూడా ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించి కేంద్రానికి పంపించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల సీనియర్ నాయకుడు పెద్దింటి వెంకటేశ్ పాల్గొన్నారు.

ఖిల్లాఘణపురం మండలంలో..

ఖిల్లాఘణపురం, ఆగస్టు 3: మండల కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ, ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాలకు బీజేపీ మండలాధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దళితమోర్చ మండలాధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు శాంతమ్మ, మండల కన్వీనర్ తులసీకుమార్, ఎస్టీ మోర్చ జిల్లా అధ్యక్షుడు రవినాయక్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, దశరథం, గోపాల్‌రెడ్డి, బూత్ అధ్యక్షుడు శివ, మహేశ్, ఓబీసీ మోర్చ అధ్యక్షుడు వెంకటేశ్, చంద్రయ్య, కృష్ణయ్య, శ్రీను, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

చిత్రపటాలకు క్షీరాభిషేకం

గోపాల్‌పేట, ఆగస్టు 3: ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం మండల కేంద్రంలో బీజేపీ, మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కోకన్వీనర్ గట్టుస్వామి మాదిగ మాట్లాడుతూ.. మంద కృష్ణ మాదిగ అలుపెరుగని పోరాటం, ప్రధాని నరేంద్రమోదీ చలువతో ఈ విజయం సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, అరవింద్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, బుడగజంగం రాష్ట్ర అధ్యక్షుడు మన్యం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

కొత్తకోట, ఆగస్టు 3: పట్టణ సమీపంలోని మదర్‌థెరిస్సా జంక్షన్ వద్ద శనివారం మధ్యాహ్నం బైక్‌ను బుల్లెట్ రైడర్ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. ఎస్సై మంజునాథ్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని చర్లపల్లికి చెందిన మాజీ సర్పంచ్ సాయిరెడ్డి(85) తన కుమారుడు వెంకట్‌రెడ్డి బైక్‌పై కొత్తకోటకు వస్తున్నాడు. మదర్ థెరిస్సా జంక్షన్ వద్ద జాతీయ రహదారిపైకి కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న బుల్లెట్ రైడర్ ఢీకొట్టింది. సాయిరెడ్డికి తీవ్ర గాయాలు కాగా వెంకట్‌రెడ్డికి కాలు విరిగింది. సాయిరెడ్డి మహబూబ్‌నగర్‌లోని ఎస్వీఎస్ దవాఖానలో చికిత్స పొందుతూ.. మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సుప్రీం కోర్టు తీర్పు చారిత్రాత్మకం

పాన్‌గల్,ఆగస్టు 3: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, చంద్రయ్య, నాగరాజు అన్నారు. శనివారం మండలంలోని గోప్లాపూర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం.. పచ్చదనం' పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ నర్సింగరావు

అయిజ, ఆగస్టు 3 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని ప్రతిపల్లెలో పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నర్సింగరావు అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ నెల 5నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. గ్రామస్థాయిలో ఉండే ప్రభుత్వ ఉద్యోగులు, ఆశ కార్యకర్తలు, వీఏవోలతో కమిటీలను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో వెంకటయ్య, ఎంపీవో మహేశ్, ఏపీవో లాల్‌నాయక్, మండల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

వీపనగండ్ల మండలంలో..

వీపనగండ్ల, ఆగస్టు 3: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు స్థానిక యువకులతో కలిసి ప్రజాప్రతినిధులు అధికారులు కృషి చేయాలని తాసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో వివిధ శాఖల అధికారులు, అంగన్‌వాడీలు, హెచ్‌ఎంలు, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో కలిసి స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. రోజువారీగా నిర్వహించే కార్యక్రమాలపై ప్రజలకు మందస్తుగానే సమాచారం అందజేయాలని సూచించారు.

విజయవంతం చేయాలి

ఇటిక్యాల, ఆగస్టు 3 : స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి లక్ష్మణ్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహమూద్ అజర్ మొహియొద్దీన్, విద్యాధికారి అశోక్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమరచింత మండలంలో..

అమరచింత, ఆగస్టు 3: స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, స్పెషలాఫీసర్ లక్ష్మప్ప, మున్సిపల్ కమిషనర్ నూరుల్‌నదీబ్, అమరచింత ఎంపీడీవో శ్రీనివాసులు కోరారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్లు, వివిధశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు తదితరులు ఉన్నారు.

పల్లెలన్నీ పచ్చదనం, పరిశుభ్రతతో మెరవాలి

మల్దకల్, ఆగస్టు 3: మండలంలోని పల్లెలన్నీ స్వచ్ఛదనం–పచ్చదనంతో మెరవాలని జెడ్పీ సీఈవో కాంతమ్మ పేర్కొన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో చెన్నయ్య ఆధ్వర్యంలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీ సీఈవో హాజరై మాట్లాడారు. ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీవరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమ అమలుపై అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్లు, కార్యదర్శులు, ఏపీఎం, ఏపీవో, సీసీలు పాల్గొన్నారు.

ఉండవెల్లి మండలంలో..

ఉండవెల్లి, ఆగస్టు 3 : ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీవో తిరుపతన్న పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన కల్పించాలి

చిన్నంబావి, ఆగస్టు 3: గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో రమణారావు అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సోమవారం నుంచి 9వ తేదీవరకు ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాజశేఖర్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి మండలంలో..

వడ్డేపల్లి, ఆగస్టు 3: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్వచ్ఛదనం.. పచ్చదనంపై ఎంపీడీవో రామకృష్ణ అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ఈనెల 5నుంచి విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్లు, ఏపీఎం, ఏపీవో, కార్యదర్శులు, సీసీలు పాల్గొన్నారు.

గట్టు మండలంలో..

గట్టు, ఆగస్టు 3: స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ప్రియాంక పేర్కొన్నారు. మండల కాంప్లెక్స్ మీటింగ్ హాల్‌లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చెన్నయ్య, ఎంపీవో రవికుమార్, ఏపీఎం సాంబశివుడు, ఏపీవో స్వామి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగరావు

పీఆర్ ఏఈఈ ఉద్యోగం రావడంపై హర్షం

విజయ్ కుమార్

వీపనగండ్ల, ఆగస్టు 3: మండల కేంద్రానికి చెందిన బత్తుల సరోజ యాదయ్య దంపతులకు చెందిన బత్తుల విజయ్‌కుమార్ చిన్న వయస్సులోనే సివిల్ విభాగంలో పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఏఈఈ)గా గజిటెడ్ ఉద్యోగం సాధించడంపై తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ.. ప్రణాళికపరం ప్రిపరేషన్ చేస్తే అనుకున్న ఉద్యోగం సాధించవచ్చన్నారు. గేట్ కూడా క్వాలీఫై కావడంతో భవిష్యత్‌లో డిపార్ట్‌మెంట్‌పరంగా రిసెర్చ్ విభాగం దిశగా కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. తన విద్యాభ్యాసం కోసం సహకరించిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

తల్లిపాలు అమృతంతో సమానం

అలంపూర్, ఆగస్టు 3 : పుట్టినబిడ్డకు ఆరు నెలల వయసు వచ్చే వరకు తల్లి పాలు అమృతంతో సమానమని, ఆరు నెలల తర్వాత అదనపు ఆహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ అన్నారు. శనివారం అలంపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

మల్దకల్, ఆగస్టు 3: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ నాగరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీ సీఈవో కాంతమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీరంగమ్మ, సురేఖమ్మ, మహేశ్వరమ్మ, పుష్పలత, సునీత, వరలక్ష్మి, పార్వతమ్మ, లక్ష్మీదేవి, అనంతమ్మ, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పాన్‌గల్ మండలంలో..

పాన్‌గల్, ఆగస్టు 3: డబ్బాపాలు వద్దు, తల్లిపాలే ముద్దని ఏఎన్‌ఎంలు రమాదేవి, శైలజ, అంగన్‌వాడీ టీచర్ చెన్నమ్మ అన్నారు. శనివారం మండలంలోని బండపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు విజయమ్మ, బాలమ్మ పాల్గొన్నారు.

గద్వాల మండలంలో..

గద్వాల టౌన్, ఆగస్టు 3: బిడ్డకు తల్లిపాలు రోగనిరోధక శక్తిని పెంచే చక్కని ఔషధమని జిల్లా సంక్షేమ అధికారిని సుధారాణి అన్నారు. శనివారం పట్టణంలోని 20వ వార్డు బీసీకాలనీ అంగన్‌వాడీ కేంద్రం–2లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొని అన్నప్రాసన చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్ వెంకటేశ్వరి, అరుణ, పోషన్ అభియాన్ కోఆర్డినేటర్ రఘునాథ్‌రెడ్డి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి మండలంలో..

కేటీదొడ్డి, ఆగస్టు 3: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు శనివారం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి పాలు బిడ్డకు ఏవిధంగా ఉపయోగపడతాయో తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ధరూర్ మండలంలో..

ధరూరు, ఆగస్టు 3: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసనం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ వజ్రమ్మ, జయమ్మ, వీరమ్మ, రజియా, సఖి సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ మండలంలో..

ఆత్మకూరు, ఆగస్టు 3: తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని ఆత్మకూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. శనివారం పట్టణంలోని 8వ, గుంటిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా.చైతన్య, అంగన్‌వాడీ టీచర్లు హసీనా బేగం, రఫీకాభాను, ఏఎన్‌ఎం అనిత, షాహీన్ బేగం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తకోట మండలంలో..

కొత్తకోట, ఆగస్టు 3: బిడ్డకు తల్లిపాలు శ్రేష్ఠమని సీడీపీవో లక్ష్మమ్మ అన్నారు. పట్టణంలోని 8వ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సబిత, అంగన్‌వాడీ టీచర్లు వనజ, చంద్రకళ, కళావతి, సావిత్రి, హేమలత, అన్నపూర్ణ, ప్రసన్న, రేవతి, విక్టోరియా, బాలీశ్వరమ్మ, తస్లీమా, దీనమ్మ, భాగ్యమ్మ పాల్గొన్నారు.

సామూహిక అన్నప్రాసన

వడ్డేపల్లి, ఆగస్టు 03 : వడ్డేపల్లి, శాంతినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం సామూహిక అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అండ్ కైలాస్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ ప్రతినిధి లత పాల్గొని చిన్నారులకు అన్నప్రాసనలో భాగంగా స్వీటు, అన్నం తినిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శిశువుకు పోషకాలు ఉండే ఆహారంను ప్రతిరోజూ ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం భాగ్యలక్ష్మి, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మల్దకల్‌లో చిన్నారులకు అన్నప్రాసన చేయిస్తున్న జెడ్పీ సీఈవో కాంతమ్మ

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PUBLIC HEALTH CHEMICALS
టెమీ ఫాస్ 50% EC, మలాథియన్ 50% EC, పైరెత్రమ్ 2% EC, డెల్టామెత్రిన్ 1.25% ULV, MLO ఆయిల్, పైరోసిన్ ఆయిల్ etc.
మునిసిల్ కార్పొరేషన్‌కి, గ్రామ పంచాయతీలకి మరియు నగర పంచాయతీలకి సప్లై చేయబడును.
డీలర్స్ మరియు మునిసిపల్ కాంట్రాక్టర్స్ సంప్రదించవలసిన నంబర్లు
9346771599, 8790185234, 9701298656

WANTED
★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-325779-AII

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line 50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.